సాక్షి
వికారాబాద్

మంగళవారం । 11 । జూన్ । 2024



అసంపూర్తి పనులు..

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 8లో▸



పెట్టుబడి సాయానికి నిరీక్షణ

వర్షాలు పడుతుండటంతో కర్షకులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. 8లో▸



నల్లాల లెక్క పక్కా

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తీరుతెన్నులపై ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేపట్టింది. 9లో▸

పాలనపై ఫోకస్

ఆయా శాఖల పనుల ప్రగతిని సమీక్షించిన కలెక్టర్

- ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో అభివృద్ధి పనులపై దృష్టి
- నకిలీ విత్తనాలను అరికట్టాలని ఆదేశాలు
- పాఠశాలల మరమ్మతులకు రూ.50 కోట్లు
- బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచన
- రైసు మిల్లర్ల అలసత్వంపై దృష్టి పెట్టండి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: ఇప్పటి దాకా లోక్‌సభ ఎన్నికల హడావుడిలో బిజీగా గడిపిన అధికారులు ఈ ప్రక్రియ ముగియడంతో మళ్లీ పాలనపై దృష్టి సారించారు. కలెక్టర్ నారాయణరెడ్డి.. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి రెండు నెలల తరువాత సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇక పాలనపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. బడిబాట కార్యక్రమం, నకిలీ విత్తనాలను అరికట్టడం, రైస్ మిల్లర్లను లీవీ విషయంలో అప్రమత్తం చేయటం, ఉద్యోగులు అటెండెన్స్ యాప్ వినియోగం తదితర అంశాలపై సమీక్ష జరిపారు.

'బడిబాట'పై నజర్

ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. విద్యాశాఖ అధికారులు అభివృద్ధి, మరమ్మతు పనులపై దృష్టి సారించాలన్నారు. బాధ్యతలు అప్పగించిన ఇతర శాఖల అధికారులు సైతం వారికి సహకరించాలని సూచించారు. బడిబాటలో భాగంగా బడీడు బాల కార్మికులందరినీ పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. ఇందుకోసం యువజన సంఘాలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలన్నారు. ఇప్పటికే యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పాఠశాలల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. స్కూళ్ల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులు సాగుకు సిద్ధమవుతున్నారని వ్యవసాయ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేసి నకిలీ విత్తనాలను అరికట్టాలని సూచించారు. నకిలీ విత్తనాల కట్టడి కోసం ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసిన విషయం కలెక్టర్ గుర్తు చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎలాంటి పంటలు వేసుకుంటే లాభాలు పొందవచ్చో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు సూచనలు చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అటెండెన్స్ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు సకాలంలో సీఎంఆర్‌ఎఫ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 96 దరఖాస్తులు రాగా వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు.



ఆందోళనకు దిగిన బాధితులు (ఇన్‌సెట్)లో శ్రీరామ జ్యువెలరీ దుకాణానికి వేసిన తాళం

నగలతో వ్యాపారి పరార్

- తాకట్టు పెట్టిన నగలు, నగదుతో ఉడాయించిన జ్యువెలరీ షాప్ యజమాని
- ధారూరులో ఘటన
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- దాదాపు రూ.6 కోట్లతో పారిపోయాడని ఆవేదన

ధారూరు: తనఖా పెట్టిన నగలు.. అప్పుగా తీసుకున్న నగదుతో ఓ నగల దుకాణం(పాన్‌బ్రోకర్) యజమాని పరారయ్యాడు. ఈ సంఘటన ధారూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుజరాత్ రాష్ట్రానికి చెందిన దీపక్ వైష్ణవ్ ధారూరు మండల కేంద్రంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ పట్టణంలోని ప్రధాన కూడలిలో శ్రీరామ్ జ్యువెలరీ పేరిట దుకాణం నిర్వహిస్తున్నాడు. చాలా కాలంగా వ్యాపారం చేస్తుండటంతో పలువురు అతని వద్ద నగలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకుంటున్నారు. వారం రోజుల క్రితం దీపక్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో తిరుపతికి వెళ్లాడు. తిరిగి రాకపోవడం, ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ చేయడంతో నగలు తాకట్టు పెట్టిన వారికి, డబ్బు అప్పుగా ఇచ్చిన వారికి అనుమానం వచ్చింది. సోమవారం దుకాణం వద్దకు వచ్చిన బాధితులు ఆందోళనకు దిగారు. దీపక్ షాప్‌కు ఎదురుగా ఉన్న మరో నగల వ్యాపారిని కలిసి ఆరా తీశారు. దీపక్ ఎక్కడ ఉన్నాడో చెప్పకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో వ్యాపారి కోస్గిలో దీపక్ బంధువులు ఉన్నారని, వారిని అడిగితే అసలు విషయం తెలుస్తుందని చెప్పాడు. ఇదిలా ఉండగా కొంత మంది బంగారం నగల కోసం రూ. లక్షల్లో అడ్వాన్సుగా చెల్లించినట్లు తెలిసింది. మరి కొంత మంది నుంచి రూ. లక్షల్లో అప్పుగా తీసుకున్నాడు. దాదాపు వంద మంది నుంచి రూ. 6కోట్ల వరకు తీసుకొని పారిపోయినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దీపక్ తన వద్ద రూ. 11.80 లక్షలు అప్పుగా తీసుకున్నాడని, మరో రూ.3 లక్షలు బంగారం కోసం ఇచ్చానని ధారూరు మండలం రాంపూర్ తండాకు చెందిన రవినాయక్ తెలిపాడు. నాగసమందర్ గ్రామానికి చెందిన అగ్గనూరు వీరేశం 10 తులాల బంగారం కోసం రూ.7 లక్షలు, అప్పుగా రూ.10 లక్షలు ఇచ్చినట్లు తెలిపాడు. గతంలో కూడా ఇద్దరు వ్యాపారులు కోట్ల రూపాయలతో పారిపోయినట్లు బాధితులు తెలిపారు. సోమవారం 12 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్‌ను వివరణ కోరగా బాధితుల ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని, దీపక్ ఆచూకీ కోసం గాలిస్తున్నామని తెలిపారు.



జీరో బిల్లు కోసం విద్యుత్ కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు

అర్హులు	లబ్ధిదారులు
47,000	34,000

- 'గృహజ్యోతి' కోసం మరో 13వేల మంది ఎదురుచూపులు
- జీరో కరెంట్ బిల్లు రాక పరేషాన్
- మున్సిపల్, విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- తమకూ వర్తింపజేయాలని వినతి

తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకం అందక అర్హులైన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పక్కింటి వారికి జీరో బిల్లు రాగా.. మాకు మాత్రం వందల్లో బిల్లు రావడం ఎంత వరకు న్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కూడా పథకం వర్తింపజేయాలంటూ మున్సిపల్, విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గృహజ్యోతి పథకానికి అర్హత ఉన్నప్పటికీ జీరో బిల్లు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అటు మున్సిపల్, ఇటు విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి స్పష్టమైన జవాబు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గృహజ్యోతి పథకం అమలవుతున్నా.. జిల్లాలో మాత్రం లోక్‌సభ ఎన్నికల కోడ్ ఎత్తివేసిన తర్వాతే ప్రారంభమైంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో పథకం అమలు చేయలేకపోయారు. దీంతో వినియోగదారులకు జీరో బిల్లు వర్తించడం లేదు. కరెంటు బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెప్పడంతో కొందరు భయపడి గృహజ్యోతి పథకానికి అర్హత ఉన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో బిల్లులు చెల్లించారు. అయితే ఎన్నికల కోడ్ ఎత్తేసిన అనంతరం సైతం జీరో బిల్లు రాకపోవడంపై ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలన సందర్భంగా తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డుతో పాటు అన్ని సమర్పించినా జీరో బిల్లు రాకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకం అమలయ్యేలా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, అధికారులు చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆదేశాలు రాగానే అమలు చేస్తాం

తాండూరు మున్సిపల్ పరిధిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి తోపాటు మరి కొన్ని పథకాలకు ప్రజలు దరఖాస్తు చేశారు. అర్హులైన తమకు జీరో బిల్లులు రావడం లేదని కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాత వారికి కూడా జీరో బిల్లులు అందేలా చూస్తాం.

– విక్రమ్ సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

దరఖాస్తు చేశా



ప్రజాపాలన సందర్భంగా గృహజ్యోతి తోపాటు ఇతర పథకాల కోసం తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు తదితర పత్రాలతో దరఖాస్తు చేశా. కానీ నాకు జీరో బిల్లు రాలేదు. దీనిపై మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. ప్రభుత్వం మరోసారి పరిశీలించి జీరో బిల్లు వచ్చేలా చూడాలి.

– శంకర్, 7వ వార్డు, తాండూరు

అర్హుల జాబితా ఇచ్చాం



తాండూరు సబ్ డివిజన్ పరిధిలో 54వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 47వేల మందిని అర్హులుగా గుర్తించాం. ఈ జాబితాను ప్రభుత్వానికి పంపాం.తమకు 34వేల మంది అర్హుల జాబితా వచ్చింది. మిగతా 13వేల మందికి రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ఆదినారాయణ, విద్యుత్ శాఖ ఏడీ

'లైన్' క్లియర్



రైల్వే లైన్ కోసం సర్వే చేస్తున్న సిబ్బంది

- వికారాబాద్ నుంచి రాయచూర్ వరకు రైల్వే లైన్ సర్వే పనులు ప్రారంభం
- పరిగి, కొడంగల్ మీదుగా సర్వేకు ఆదేశాలు
- జిల్లాలో మూడు నియోజకవర్గాలకు మేలు

కొడంగల్: వికారాబాద్ – కృష్ణా రైల్వేలైన్ సర్వే పనులు ప్రారంభమయ్యాయి. నారాయణపేట జిల్లా కృష్ణ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ వరకు సర్వే చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. వికారాబాద్ తోపాటు పరిగి, కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు మేలు జరుగుతుంది. నాలుగు దశాబ్దాలుగా నానుతూ వస్తున్న రైల్వే లైన్ పనులకు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మోక్షం లభించింది. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. సీఎం రేవంత్ రైల్వే శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి పనులను వేగిరం చేయాలని కోరారు. దీంతో సర్వే పనులకు శ్రీకారం చుట్టారు. వికారాబాద్ నుంచి పరిగి, కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల మీదుగా రాయచూర్‌కు రైల్వే లైన్ వేయాలని భావిస్తున్నారు. వికారాబాద్ – కృష్ణా రైల్వేలైన్ ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. ఈ పనులు పూర్తయితే జిల్లా ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగు పడుతుంది.

40 ఏళ్ల క్రితమే సర్వే

కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేయాలనే ఉద్దేశంతో 1980 –81 సంవత్సరంలో అప్పటి మహబూబ్‌నగర్ ఎంపీ, రైల్వేశాఖ సహాయ మంత్రి మల్లికార్జున్ సర్వేకు ఆదేశించారు. వికారాబాద్ నుంచి పరిగి, దోమ, సర్దార్‌ఖాన్‌పేట, మద్దూరు, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణ వరకు రైల్వేలైన్ నిర్మాణానికి సర్వే చేయించారు. అయితే కొడంగల్ ప్రజల డిమాండ్ మేరకు రెండో సారి సర్వేకు కేంద్రం ఆదేశించింది. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మీదుగా లైన్ వేస్తే ఆదాయం వస్తుందని గణాంకాలను విశ్లేషిస్తూ ఇక్కడి ప్రజలు, అధికారులు కేంద్రానికి నివేదిక పంపించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి ఆదేశాల మేరకు మరోసారి సర్వే జరిగింది. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే బాగుంటుందని నిపుణులు నివేదిక సమర్పించారు. అనంతరం రాష్ట్ర విభజన జరగడం, ఆ తర్వాత జిల్లాల విభజన జరిగింది. కోస్గి, మద్దూరు మండలాలు మహబూబ్‌నగర్ జిల్లాలోకి వెళ్లాయి. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలు వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కొడంగల్ మీదుగా రైల్వేలైన్ వేస్తే జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించడానికి వీలుగా ఉంటుందని స్థానికులు పలు మార్లు కేంద్ర మంత్రులకు, ఎంపీలకు, అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.

కొడంగల్ మీదుగా..

వికారాబాద్ జిల్లా నుంచి పరిగి, బొంరాస్‌పేట, కొడంగల్,కోస్గి,మద్దూరు,నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్, కృష్ణ మీదుగా రాయిచూర్ వరకు రైల్వేలైన్ నిర్మిస్తే జిల్లా ప్రజలకు మేలు జరుగుతుంది. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి సులువుగా ఉంటుంది. అంతేకాకుండా వివిధ రకాల సరుకుల రవాణా ద్వారా రైల్వేశాఖకు ఆదాయం వస్తుంది. సర్వే పనులు ప్రారంభం కావడంతో జిల్లా వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు గడుపు పొడిగింపు


షాద్‌నగర్‌రూరల్: కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్‌వారి ఆదేశాల మేరకు ఐటీఐ కళాశాలలో చేరేందుకు అడ్మిషన్ల గడుపు పెంచడ జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్‌కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఐటీఐలో ప్రవేశం తీసుకోవాలనుకునే విద్యార్థులు ఐటీఐ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఐదు పీజీటీ అవర్లీ బేస్డ్ టీచర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్ల మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఐదు టీచర్ పోస్టులకు (అవర్లీబేస్డ్ బోధన) ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. ఐదు పీజీటీ టీచర్ల పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఇందులో రెండు తెలుగు, ఒకటి హిందీ, ఫిజిక్స్, జువాలజీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, అనుభవం అంశాలను ప్రాతిపదికగా తీసుకొని మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

నామినేటెడ్‌పై నజర్

- పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేయత్నం
- అధిష్టానం పరిశీలనలో మరికొంత మంది పేర్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులపై పలువురు నేతలు దృష్టి సారించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఏళ్ల తరబడి పార్టీ బలోపేతం కోసం కష్టపడుతూ, టికెట్లను సైతం త్యాగం చేసిన కీలక నేతలు ప్రభుత్వంలోని వివిధ నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. వీటిని దక్కించుకునేందుకు తమదైన శైలిలో పెద్దలతో పైరవీలు మొదలుపెట్టారు.ఇప్పటికే జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కాయి. తాజాగా మరి కొన్ని కార్పొరేషన్లు, కమిషన్లకు చైర్మన్లను నియమించే అవకాశం ఉండటంతో సామాజిక సమీకరణాలు,స్థానిక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ పదవులను కట్టబెట్టే అవకాశం ఉండటంతో ఎవరికి వారు వ్యక్తిగత పైరవీలు మొదలు పెట్టినట్లు సమాచారం.

ఆశావహుల్లో రేకెత్తిస్తున్న ఆశలు

రాష్ట్రంలో పలు కీలక కమిషన్లు, కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. ఇప్పటికే జిల్లాకు మూడు పదవులు కేటాయించింది. వీటిలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోస్టును మల్‌రెడ్డి రాంరెడ్డికి కేటాయించగా, పట్టణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవిని కట్టబెట్టింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో తాజాగా మరో 15 నుంచి 20 కార్పొరే షన్లు, కమిషన్లకు చైర్మన్లు నియమించాలని భావిస్తోంది. ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న వారితో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన వారికి ఇప్పటికే చైర్మన్ పోస్టులను కట్టబెట్టాలని యోచిస్తోంది. దీంతో సీఎం రేవంత్‌కు, అధిష్టానం పెద్దలకు సన్నిహితంగా ఉన్నవారితో పాటు సీట్లను త్యాగం చేసిన వారిలోనూ ఈ పదవులు ఆశలు రేకెత్తిస్తున్నాయి.

న్యూస్‌రీల్

విద్యార్థులకు సన్మానం



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతగిరి: నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి అభినందించారు. వికారాబాద్ జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎండీ ఫరాన్, సయ్యద్ సోహెల్, సంతోష్ కుమార్, ఎండీ ఫిరోస్ ప్రతిభ చూపారు. వీరిని కలెక్టర్ తోపాటు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హనుమంతరావు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్ నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ పకీరా రాత్లవత్ అభినందించి శాలువాలతో సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పకీరా రాత్లావత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎంపీసీ మొదటి సంవత్సరంలో 4, బైపీసీలో 4 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపా రు. అర్హులైన విద్యార్థులు జూన్ 15లోపు దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ల 9959746436, 7331170809లో సంప్రదించాలని సూచించారు.

విత్తన సమస్య లేదు



గోపాల్

అనంతగిరి: జిల్లాలో పత్తి విత్తనాలకు ఎలాంటి సమస్య లేదని, రైతులు ఆందోళన చెందరాదని వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 2,63,500 ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందుకోసం 5,45,000 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని, 4,23,316 ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే 1,43,764 ప్యాకెట్లను రైతులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. విత్తన డీలర్లు తమ లైసెన్సు వివరాలు, విత్తన స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. కొన్ని రకాల విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయని రైతులు అపోహ పడుతున్నారని, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. హైబ్రీడ్ విత్తన రకాలన్నీ ఒకే తరహా దిగుబడులు ఇస్తాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. బీజీ 2 రకం ఏ కంపెనీ విత్తనమైనా సరైన సమయంలో, సరైన యాజమాన్య పద్ధతిలో విత్తుకోవడం, కలుపు నివారణ, చీడపీడలు ఆశించకుండా మందులను పిచికారీ చేస్తే అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు.

అవమానిస్తున్నాడని అంతమొందించాడు



తులరామ్ మృతదేహం

మహేశ్వరం: సరిగ్గా పని చేయడంలేదని తోటి కార్మికుడు అన్నందుకు అవమానం భరించలేక నిద్రిస్తున్న సమయంలో కర్రతో తలపై బాది హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని తుమ్మలూరులో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తుక్కుగూడ గ్రామానికి చెందిన మంగ్యా నాయక్ తుమ్మలూరు గ్రామ శివారులో ఇటుక బట్టీ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. బట్టీలో ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన పలువురు కార్మికులు పని చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రం నుపాడ జిల్లా కొమ్నా మండలం మాన్‌పాడ్ గ్రామానికి చెందిన తులరామ్ సోబోర్(42) ఐదు నెలలుగా మేస్త్రీగా పని చేస్తున్నాడు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం మణిపూర్ గ్రామానికి చెందిన కేత్రో యాదవ్ బట్టీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇటుకలు తయారు చేసే క్రమంలో సరిగ్గా పని చేయడం లేదని తులరామ్ తరచూ కేత్రోయాదవ్‌ను మందలిస్తూ వచ్చాడు. దీంతో అతనిపై కక్ష పెంచుకున్న కేత్రోయాదవ్ అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి తులరామ్ నిద్రిస్తుండగా షెడ్‌లోకి చొరబడి కర్రతో తలపై బలంగా కొట్టాడు. అలికిడికి చుట్టు పక్కల కార్మికులు లేవడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. తోటి కార్మికులు తులరామ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు తులరామ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 56 కిలోల గంజాయి పట్టివేత

అనంతగిరి/అడ్డగుట్ట: కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఆర్పీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు . సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్పీఎఫ్ అధికారులు వివరాలు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్పీఎఫ్ పోలీసులు నిరంతర నిఘా ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగా ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ నార్కోస్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వివిధ బృందాలు రైల్వే స్టేషన్లు, రైళ్లలో నిత్యం సోదాలు, తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ఆదివారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ వ్యక్తి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి, రూ. 14 లక్షలు విలువచేసే 56 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని వికారాబాద్ జీఆర్పీ పోలీసులు అప్పగించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు రూ. 2.70 కోట్ల విలువైన 1084.49 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వారు వివరించారు.

న్యాయం చేయాలని డీజీపీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన అనంతరం కార్యాలయం ఎదుట ఫిర్యాదు పత్రంతో నాయకులు

పరిగి: కులం పేరుతో దూషించి ఇష్టానుసారంగా దాడులు చేసిన వారిని అరెస్ట్ చేయకుండా పోలీసులు కొమ్ము కాస్తున్నారని సోమవారం రుక్కుంపల్లి దళిత సంఘ నాయకులు డీజీపీకి ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని రుక్కంపల్లి గ్రామానికి చెందిన హరిజన మొగులయ్యపై గ్రామానికి చెందిన కొంత మంది దాడి చేయడంతో గత నెల 2వ తేదీన నలుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కానీ వారిని అరెస్ట్ చేయకపోవడంతో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. అయినా పోలీసుల్లో కదలిక లేకపోవడంతో డీజీపీ కార్యాలయంలో తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృత్యువాత పడిన ఎద్దు వద్ద విచారంలో రైతు

పూడూరు: ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎన్కేపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు కిష్టం గోపాల్ తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్కేపల్లి హిట్స్ కాలేజీ సమీపంలో మామిడితోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు మృతి చెందిందని తెలిపారు. దాని విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

తాండూరు టౌన్: రైలు ఢీకొని గుర్తు తెలియని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన తాండూరు–మంతట్టి రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీరేశం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం తాండూరు–మంతట్టి మధ్య రైలు పట్టాల పక్కన సుమారు 25 ఏళ్ల వయసు గల ఓ యువకుడు మృతి చెంది ఉన్నాడు. రైలు ఢీకొనడం వల్ల మృతి చెంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుని ఒంటిపై నీలి రంగు షర్టుపై చిన్న గళ్లు కలిగి ఉన్నట్లు చెప్పారు. వికారాబాద్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. మృతున్ని గుర్తించిన వారు 8712513854 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

బొంరాస్‌పేట: మహిళా సంఘాల నాయకురాళ్లు నిధులు దుర్వినియోగం చేశారని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు స్వయం సహాయక ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. మండలంలోని బురాన్‌పూర్ 2వ గ్రామసంఘం నాయకురాళ్లు గతంలో కమిషన్ డబ్బులు దుర్వినియోగం చేశారని, దీనిపై ఏపీఎం అంజిలయ్య, డీపీఎం వీరయ్య, వీఓఏలను సస్పెండ్ చేశారు. అనంతరం రూ.4లక్షలు రికవరీ చేసి గ్రామ సంఘం ఖాతాలో జమచేశారు. తర్వాత మారిన అధ్యక్షురాలు సంఘం సభ్యుల ఆమోదం లేకుండా సదరు డబ్బును దుర్వినియోగం చేశారని కలెక్టరుకు స్వయం సహాయక మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అసంపూర్తి పనులు.. అవస్థల్లో విద్యార్థులు

నేటి బాలలే రేపటి పౌరులంటారు. అలాంటి చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రస్తుతం పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన తీవ్రంగా వేధిస్తోంది. ప్రారంభానికల్లా బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. కానీ ఎక్కడా పనులు పూర్తయిన దాఖలాలు లేవు. తాగునీరు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల పాలిట శాపంగా మారునుంది.

- ప్రభుత్వ బడుల్లో పూర్తికాని మరమ్మతులు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- రేపు పాఠశాలల పున:ప్రారంభం



తాండూరు టౌన్: ప్రహరీ లేని మాణిక్‌నగర్ పాఠశాల

అరకొర వసతులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది వరకు అరకొర వసతుల నడుమ విద్యార్థులు చదువులు కొనసాగించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నేతృత్వంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. పాఠశాలలు ప్రారంభవుతున్నప్పటికీ ఇంకా పనులు మాత్రం పూర్తి కాలేదు. పట్టణంలో 15 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, 9 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఉర్దూ మీడియం పాఠశాలల్లో మాత్రం ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. పట్టణంలోని పలు ఉర్దూ మీడియం పాఠశాలల్లో 15 మంది వరకు ఉపాధ్యాయులను భర్తీ చేయాల్సి ఉంది. మిగతా పాఠశాలల్లో ఒకటి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కొనసాగుతుండటంతో ఈ పాఠశాలల నుంచి వెళ్లిపోయిన ఉపాధ్యాయుల స్థానంలో ఇతరులు వస్తారో లేదో అనే సందేహం కలుగుతోంది.



తాండూరు టౌన్: ఉర్దూ మీడియం బడిలో మరమ్మతుకు నోచుకోని వాటర్ ప్లాంటు

శిథిలావస్థకు మరుగుదొడ్డి



చెన్‌గేస్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్డి

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదు. మరో రెండు రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. కానీ ఇప్పటి వరకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాండూరు పట్టణం, రూరల్ కలిపి 70కి పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మరుగుదొడ్డి, టాయిలెట్లు శిథిలావస్థకు చేరాయి. పాఠశాల మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు. ఇలా అన్నీ పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. శౌచాలయాలు అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. అన్నీ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లు ఉన్నట్లు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు.

పెచ్చులూడిపోతున్నాయి

యాలాల: మండలంలో మొత్తం 10 ఉన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ప్రభుత్వం ఇటీవల అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మరమ్మతు పనులు ఇంకా పూర్తి కాలేదు. ప్రతి పాఠశాలలో కరెంటు, పైకప్పు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతుల కల్పనక పనులు చేపట్టాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ చాలా పాఠశాలల్లో పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. యాలాల మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల పైకప్పు చిన్నపాటి వర్షానికి తడిసిపోయి నీరు కారి ప్రమాదకరంగా మారింది. పైకప్పు స్లాబ్‌కు బీటలు ఏర్పడ్డాయి. వరండాలో పైకప్పు లీకేజీతో గోడలు నాచుపట్టి ప్రమాద తీవ్రతను తెలుపుతున్నాయి. అయితే పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ప్రతి పాఠశాలలో సాంఘిక, ఇంగ్లిష్, భాషా పండితులు, పీఈటీ, పీడీ సమస్యలు ఉన్నాయి.



యాలాల: హరిజనవాడలో పైకప్పు పెచ్చులూడటంతో వర్షపు నీటికి తడిసి నాచు పట్టిన గోడ

ఆక్రమణలపై అధికారుల కొరడా



ఈదుల చెరువులో నిర్మించిన రోడ్డును జేసీబీలతో కూల్చివేయిస్తున్న అధికారులు

- ఈదుల చెరువులో నిర్మించిన రోడ్డు కూల్చివేత
- పెద్దఅంబర్‌పేటవాసుల ఒత్తిడితో చర్యలు

అబ్దుల్లాపూర్‌మెట్: నిబంధనలకు విరుద్ధంగా చెరువును ఆక్రమించుకొని యథేచ్ఛగా చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కూల్చివేశారు. గ్రామస్తులందరూ ఏకతాటిపైకి వచ్చి చెరువు ఆక్రమణను అడ్డుకోవాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఎట్టకేలకు రెండు జేసీబీల సహాయంతో రోడ్డును తొలగించారు. పెద్ద అంబర్‌పేటలోని ఈదుల చెరువును గత కొన్ని రోజులుగా కొంతమంది రియల్ వ్యాపారులు ఆక్రమించుకొని చెరువు మధ్యలోంచి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారన్న విషయాన్ని స్థానిక కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, గ్రామస్తులు కొన్ని రోజులుగా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా పట్టించుకోకపోవడంతో ధర్నా చేస్తామని హెచ్చరించగా సోమవారం రెవెన్యూ అధికారుల సహకారంతో కూల్చివేయించారు. ఈ క్రమంలో అధికారులకు గ్రామ ప్రజలకు మధ్య కొంత వాగ్వాదం సైతం చోటు చేసుకోగా, చెరువును కబ్జా కాకుండా స్పందించిన అధికారులకు ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ ఉషారాణి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి పలుపార్టీల నేతలు ప్రభాకర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజు, నాగేష్, బాలకృష్ణ, అరవింద్‌యాదవ్, యాదగిరిగౌడ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆక్రమణ వెనుక ఓ కౌన్సిలర్ హస్తం

చెరువు ఆక్రమణ వెనుక పెద్దఅంబర్‌పేటలోని అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ హస్తం ఉందని స్థానికులు ఆరోపించారు. భారీ స్థాయిలో ముడుపులు తీసుకుని చెరువులోంచి రోడ్డును వేసేందుకు ఆక్రమణదారులకు వెనుకనుంచి ఆయనే ప్రోత్సహిస్తున్నాడన్నారు. దీంతో పాటు ఆక్రమణదారుల ద్వారా ఓ ప్లాటును కూడా తన బినామీల పేరు మీద రాయించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడాలని గ్రామానికి చెందిన కౌన్సిలర్లందరూ పోరాడి కూల్చివేయించేంత వరకూ అక్కడే ఉన్నారు. సదరు కౌన్సిలర్ అటువైపునకు రాకపోగా గ్రామంలో అందుబాటులో లేకపోవడంతో గ్రామస్తుల ఆరోపణలకు బలం చేకూరుతున్నదన్నారు. చెరువుపై ఆధారపడి ఉన్న మత్స్యశాఖ కార్మికులు హెచ్చరించినా పెడచెవిన పెట్టిన కౌన్సిలర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మండల స్థాయి అధికారులను సైతం బెదిరింపులకు పాల్పడుతున్నారని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



సుగుణ (ఫైల్)

శంకర్‌పల్లి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన సోమవారం శంకర్‌పల్లి మండలంలో చోటు చేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండకల్ తండాకు చెందిన సుగుణ(45), కొన్నేళ్ల కిందట భర్త చందర్ మృతి చెందగా.. కొడుకుతో కలిసి ఉంటుంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సుగుణ ఇబ్బంది పడుతుంది. కుటుంబ సభ్యులకు భారం కావొద్దనే ఉద్దేశంతో ఇప్పటికే ఇంట్లో నుంచి రెండుసార్లు వెళ్లి పోయింది. వెతికితే.. లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో దొరికింది. అయితే, ఆదివారం సాయంత్రం బయటకి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన సుగుణ రాత్రి వరకు తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం మోకిల ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునున్నట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

కేంద్ర మంత్రులకు అభినందనలు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో జిల్లా నేతలు

తాండూరు టౌన్: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను బీజేపీ జిల్లా నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా ఢిల్లీలో కలిశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేశ్‌కుమార్, శివరాజ్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సాహు శ్రీలత తదితరులు కేంద్ర మంత్రులను కలిసి శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ బలీయమైన శక్తిగా ఎదగడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

కబ్జాపై అధికారుల చర్యలు

విజయ విద్యాలయ పాఠశాల పక్కన 16 గుంటల స్థలం స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు: తాండూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉన్న సర్వే నంబర్ 111లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ చేశారు. ఈ నెల 8వ తేదీన సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ స్థలాలపై కన్ను' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఉన్నతాధికారుల నుంచి తహసీల్దార్ తారాసింగ్‌కు ఆదేశాలు వచ్చాయి. దీంతో సోమవారం తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, సర్వేయర్ శ్రీహరిలు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉన్న విజయవిద్యాలయ పాఠశాల క్రీడా మైదానం వద్దకు చేరుకున్నారు. సర్వేనంబర్ 111 స్థలంలో పసారం బస్వరాజ్ పేరిట బోర్డు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే పసారం బస్వరాజ్‌తో పాటు కుటుంబ సభ్యులు ఈ స్థలం తమదేనంటూ అధికారుల ఎదుట వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడే ఉన్న సర్వేయర్ శ్రీహరి ఆధారాలతో సహా సర్వేనంబర్ 111లోనే 16 గుంటల భూమి ఉందని రికార్డులు చూపించారు. కంచె వేసి బోర్డు పాతిన వారు వెంటనే తొలగించాలని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. తాండూరు మున్సిపల్ పరిధిలోకి వచ్చే సర్వేనంబర్ 111లో 14ఎకరాల 14 గుంటల భూమి ఉందన్నారు. తాజాగా విజయవిద్యాలయ పాఠశాల పక్కన ఉన్న 16 గుంటల భూమి ప్రభుత్వానిదే అని గుర్తించామన్నారు. విలువైన భూమిని ఆక్రమించి కంచె వేసుకొన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలంలో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

కుక్కల దాడిలో జింకకు గాయాలు



పాలబావితండాలో గాయపడిన జింకతో స్థానికులు

రక్షించిన తండావాసులు

బొంరాస్‌పేట: అడవి నుంచి తప్పిపోయిన ఓ జింకను చేరదీసి అధికారులకు అప్పగించిన ఘటన మండలంలోని బాపల్లితండా గ్రామపంచాయతీ పరిధి పాలబావితండాలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పాలబావితండాకు సమీపంలో పొలాల వైపు నుంచి వచ్చిన ఓ జింకను ఊర కుక్కలు వేటాడాయి. నోట పట్టుకొని తండాలోకి తీసుకువచ్చాయి. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు, తండావాసులు గమనించి గాయపడిన జింకను సంరక్షించి కొడంగల్ అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు బీట్ అధికారులు రవిరాఘవరెడ్డి, ప్రశాంతిలకు అప్పగించారు. కొడంగల్ ఎఫ్ఆర్ఓ కార్యాలయానికి తరలించారు. సెక్షన్ అధికారి రమేశ్ ఆదేశాల మేరకు జింకకు వైద్యం అందించారు.

క్వింటాల్ నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

యాలాల: భారీగా నిల్వ ఉంచిన పేరు లేని నకిలీ పత్తి విత్తనాలను యాలాల పోలీసులు సోమవారం పట్టుకొని సీజ్ చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పగిడియాల గ్రామానికి చెందిన కొత్త కిష్టప్ప వద్ద నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వ్యవసాయ శాఖ ఏఓ యాదగిరితో కలిసి కిష్టప్ప ఇంట్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో కిష్టప్ప ఇంట్లో నిల్వ ఉంచిన క్వింటాలు నకిలీ పత్తి విత్తనాలను గుర్తించారు. దీంతో వాటిని సీజ్ చేసి యాలాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కిష్టప్పను విచారించగా.. కోస్గి మండలం కొత్తపల్లికి చెందిన నరేష్ తనకు విత్తనాలు సరఫరా చేసినట్లు కిష్టప్ప పోలీసుల ఎదుట తెలిపారు. ఏఓ యాదగిరి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలను రైతులకు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.



పగిడియాలలో పట్టుబడిన నకిలీ విత్తనాల బస్తాలు

అడిషనల్ కలెక్టర్‌కు వినతి

బడంగ్‌పేట్: అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్‌ను సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి కలిసి వినతిపత్రం అందచేశారు. కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ కుర్మల్‌గూడలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం భవనాల సముదాయంలోనే ఖాళీగా ఉన్న భవనాలను గుర్తించి పేదలకు కావాల్సిన వసతులను కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రం ఇతర కౌంటర్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. 2024–25 విద్యాసంవత్సం నుంచే తరగతులు ప్రారంభించేలా చూడాలన్నారు. వైద్యం సైతం అక్కడే నిర్వహించేలా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మేయర్ పారిజాత

పెట్టుబడి సాయానికి నిరీక్షణ

- వానాకాలం ప్రారంభమైనా రైతుభరోసాపై స్పష్టత కరువు
- ఆందోళనలో అన్నదాతలు



ఆలేడ్‌లో వరి సాగులో నిమగ్నమైన రైతు

దుద్యాల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో కర్షకులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. సాగు ప్రక్రియ ముమ్మరం కావడంతో అన్నదాతల్లో అలజడి మొదలైంది. వారికి పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందించే రైతు భరోసా నిధుల కోసం నిరీక్షిస్తున్నారు. సార్వత్రిక సమరం ముగిసిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతు భరోసాపై తీపి కబురు వస్తుందని రైతులు ఆశించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో పెట్టుబడి ఖర్చులకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

యాసంగిలో పాత పద్ధతిలో..

రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థి తప్పించి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం రైతు బంధు పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఏటా ఎకరాకు రూ.10వేల చొప్పున అందించారు. తాము అధికారంలోకి వస్తే ఈ సాయాన్ని రూ.15వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ యాసంగి సీజన్‌లో పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం ఎకరానికి రూ.5వేల చొప్పున అందించారు. ఈ సీజన్ నుంచి సాయం పెంచుతామని అప్పట్లో ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే పంటలు వేసుకునే సమయం సమీపిస్తున్నప్పటికీ పెట్టుబడి సాయం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

పరిమితులు విధిస్తారా?

కొరత కారణంగా యాసంగికి సంబంధించిన పెట్టుబడి సాయాన్ని విడతల వారీగా పంపిణీ చేశారు. దీంతో రైతు భరోసాకు పరిమితులు విధిస్తారన్న ప్రచారం కూడా జోరుగా జరిగింది. గతంలో అనర్హులకు రైతు భరోసాను అందించడం ద్వారా ప్రజాధనం వృథా అయిందని ప్రస్తుత పాలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం సాగుకు యోగ్యం లేని భూములకు పెట్టుబడి సాయం చెల్లించకూడదని ప్రభుత్వం అభిప్రాయానికి వచ్చింది. అంతే కాకుండా రైతు భరోసాను కుదించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ అంశాలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. రైతు భరోసా అమలుకు సంబంధించిన విధివిధానాలపై ఎలాంటి ముందడుగు కనిపించలేదు. గతంలో జూన్‌లోనే ఖరీఫ్‌కు సంబంధించి పెట్టుబడి సాయం జమ చేసేవారు. ప్రస్తుతం వానాకాలం పంటల సాగు కోసం రైతులు మదనపడుతున్నారు.

ఎలాంటి ఉత్తర్వులూ రాలేదు



రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. తప్పకుండా ఈ నెలలోనే స్పష్టత వస్తుంది. పెట్టుబడి సాయంపై రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. రైతుల వివరాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే అర్హుల ఖాతాలలో నగదు జమ చేస్తాం.

– శంకర్ రాథోడ్, ఏడీఏ, కొడంగల్